# శర నవరాత్రులకు వేళాయే..



మాట్లాడుతున్న ఆలయ ఈవో విజయరామరావు

బాసర, అక్టోబరు 14 : నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో ఆదివారం నుంచి అమ్మవారి నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఈవో విజయరామరావు తెలిపారు. శనివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమ్మవారి నవరాత్రోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించే మూల నక్షత్ర పూజలకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు చేశామన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్లు, వీఐపీ క్యూలైన్లు, ప్రత్యేక దర్శన క్యూలైన్లను ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**ఉత్సవాలకు ముస్తాబైన అమ్మవారి ఆలయం....**

నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ఆలయంలో రంగురంగుల విద్యుత్ దీపాలతో మెరిసిపోతుంది. ఆలయ ఆవరణతో పాటు ఆలయ చుట్టు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ కాంతులతో ఆలయం మెరిసిపోతుంది. భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్లు, తాగు నీరు, తదితర సౌకర్యాలను అధికారులు అందుబాటులో ఉంచారు.

# ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



దస్తురాబాద్: స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ దండె విఠల్

దస్తురాబాద్, అక్టోబర్ 14 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం గొడిసేర్యాల గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి స్వామి ఆలయంలో శనివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి మార్గంతో ఆత్మ విశ్వాసం, క్రమ శిక్షణ పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు సీడాం లక్ష్మణ స్వామి శ్రీరాజరాజేశ్వరి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న జోనల్ స్థాయి పోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఇచ్చోడ, అక్టోబర్ 14 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల(బాలికల)లో 7వ జోనల్ స్థాయి క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. శనివారం ఆదిలాబాద్, మెదక్ రీజినల్‌లోని 18 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. 14, 17, 19 కేటగిరీల్లో 14 గేమ్స్, 13 అథ్లెటిక్స్‌లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆదివారం జోనల్ స్థాయి పోటీలు ముగిస్తాయని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్, వైస్‌ప్రిన్సిపాల్ అశ్విని తెలిపారు.



లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారులు

# పెరటి తోటలు.. ఆరోగ్యానికి బాటలు

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంపకం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 14 : బాలింతలు, గర్భిణులు, చిన్నారుల్లో పోషకాహార లోపం నివారణకు గాను ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటలు పెంచాలని సంకల్పించింది. పోషణ్ మహాన్ కార్యక్రమం ద్వారా సేంద్రియ ఎరువులతో కూరగాయల పెంపకానికి శ్రీకారం చుట్టగా జిల్లాలో పెరటి తోటల పెంపకం సత్ఫలితాలిస్తున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన, తాజా పోషకాహారం అందించేందుకు ఈ తోటల పెంపకం తోడ్పాటునందిస్తున్నాయి. నిర్మల్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో న్యూట్రీషన్ గార్డెన్లు ఏర్పాటు చేసి కూరగాయలు పెంచుతున్నారు. పెరటితోటల్లో పెంచిన కూరగాయలను అంగన్‌వాడీ కేంద్రాల్లో వండుతున్నారు. కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ కాయగూరలు పెంచుతున్నారు. పెరటితోటలో క్యాబేజీ, టమాట, మిర్చి, బెండ, గోంగూర, పాలకూర, వంటి ఆకుకూరలు పెంచుతున్నారు. కూరగాయలు పెంచేందుకు జిల్లా సంక్షేమ అధికారులు చర్యలు చేపడుతున్నారు.



మాదేగాంలో పెరటితోటలో కూరగాయలు కోస్తున్న సీడీపీవో, సూపర్‌వైజర్, టీచర్



ముథోల్‌లో న్యూట్రీగార్డెన్‌ను పరిశీలిస్తున్న డీడబ్ల్యూవో

**జిల్లాలో 451 కేంద్రాల్లో న్యూట్రీషన్ గార్డెన్లు**

జిల్లాలో మొత్తం నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టు పరిధిలో మొత్తం 926 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 451 కేంద్రాల్లో పెరటితోటల పెంపకానికి అనువైన స్థలం ఉండడంతో కూరగాయలను సాగు చేస్తున్నారు.

**పోషణ లోపం నివారణకు పెరటి తోటల పెంపకం**



గర్భిణులు, చిన్నారుల్లో పోషణ లోపం నివారణకు గాను నిర్మల్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంచాలని సిబ్బందికి సూచించడం జరిగింది. కేంద్రాల్లోని ఖాళీ స్థలాల్లో న్యూట్రీషన్ గార్డెన్లు ఏర్పాటు చేశాం. సేంద్రియ ఎరువులతో కాయగూరలు పెంచుతున్నారు. పెరటి తోటలో పండించిన కూరగాయలతోనే వడ్డన చేస్తున్నారు. పెరటితోటల పెంపకాన్ని సీడీపీవోలు, సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు.

-ఎర్రపత్తి రమేశ్, జిల్లా సంక్షేమ అధికారి, నిర్మల్

## నిర్మల్ వాసికి డాక్టరేట్




డాక్టర్ పీజీ రెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 14 : ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు, నిర్మల్ జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి పీజీ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మల్ నందు చరిత్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న పీజీ రెడ్డి యూనివర్సిటీ ప్రొఫెసర్ అంజయ్య పర్యవేక్షణలో (సొసైటీ అక్చర్ అండ్ ఎకానమి ఇన్ మెడివల్ ఆంధ్ర హిస్టారికల్ పర్‌స్పెక్టివ్ (మధ్య యుగ ఆంధ్ర దేశంలో 1000-1687 సాంఘిక సాంస్కృతిక ఆర్థిక పరిస్థితులు) అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నారు. పీజీ రెడ్డిని శనివారం కళాశాల ప్రిన్సిపాల్ భీమారావు, అధ్యాపకులు శాలువాతో సన్మానించారు.

## గంజాయి స్వాధీనం

ఎదులాపురం, అక్టోబర్ 14 : ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ వద్ద గంజాయి అమ్ముతున్న తాటిగూడకు చెందిన దుమట్టి సాయికుమార్‌కు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 39 చిన్నప్యాకెట్ల 100 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ సీఐ డీ సాయినాథ్ తెలిపారు. అతడిని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని తెలిపారు. ఎండు గంజాయిని కిన్వట్ నుంచి తీసుకొని వస్తున్నట్లు పేర్కొన్నారు.

## దేశీదారు బాటిళ్లు..

ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని ఖుర్షిద్‌నగర్ బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 8 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీసీఎస్ సీఐ డీ సాయినాథ్ తెలిపారు. అలాగే ఖుర్షిద్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తున్న యునూస్ రూ.2,530 నగదు, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

## మద్యం పట్టివేత



సోన్: పట్టుకున్న మద్యం సీసాలు

సోన్, అక్టోబర్ 14 : నిర్మల్ మండలం మేడిపెల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన వాహన తనిఖీలో గ్రామానికి చెందిన కుంట మహేందర్ వద్ద రూ. 43 వేల విలువ చేసే మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లిక్కర్, బీర్లు లభించగా వీటిని సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఎవరైనా అక్రమ మద్యం అమ్మినా, నిల్వ ఉంచినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గంజాల్ టోల్‌ప్లాజా వద్ద నగదు..

సోన్ మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద ఎస్ఐ సంతోషం రవీందర్ ఆధ్వర్యంలో శనివారం వాహనాలు తనిఖీలు చేశారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారును తనిఖీ చేస్తుండగా ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 1,57,260 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిర్మల్ మండలంలోని మంజులాపూర్, రత్నాపూర్‌కాండ్లీ, విశ్వనాథ్‌పేట్, తదితర ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ద్విచక్రవాహనాలతో పాటు ఇతర వాహనాలను ఆపి పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతనే వారిని పంపుతున్నారు.

## కల్లూరు జాతీయ రహదారిపై ..

కుంటాల, అక్టోబర్, 14: మండలంలోని కల్లూరు జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మహారాష్ట్రకు చెందిన రెండు వాహనాల్లో సరైన పత్రాలు లేని రూ.1,61,950 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హన్మండ్లు తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్య

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 14 : ఆదిలాబాద్‌లోని చించార్వాడకు చెందిన పులి గణేశ్ (60) కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని నెలలుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మావల హరితవనం మొదటి గేటు ఎదుట ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణు వర్ధన్ తెలిపారు.